నిర్మానుష్యంగా బీచ్..

భారికేడ్ల వద్ద పర్యాటకులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరు పాలెం సౌత్, కెపి పాలెం సౌత్ గ్రామాల్లో విస్తరించిన బీచ్ ఆదివారం నిర్మానుష్యంగా మారింది. బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాన్ ప్రభావంతో సముద్రంలోని అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. దీంతో బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ జి.వాసు పర్యవేక్షణలో సిబ్బంది భారీ కేట్లను ఏర్పాటు చేసి పర్యాటకులను బీచ్‌లోని సముద్ర స్నానాలకు అనుమతించలేదు. దీంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని, సరివి కొబ్బరి తోటల్లో సహపంతి భోజనాలు చేశారు.

భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలి

సభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి
కె.ఉమా మహేశ్వరరావు
జిల్లా నూతన కమిటీ ఎన్నిక
అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా
కర్రి నాగేశ్వరరావు, బి.వాసుదేవరావు

ప్రజాశక్తి - పెనుగొండ

కార్మిక, కర్షకులు ఐక్యతతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. పెనుగొండ లక్ష్మీ జనార్ధన కళ్యాణ మండపంలో సిఐటియు 13వ జిల్లా మహాసభ ఉత్సాహభరితంగా ఆదివారం ముగిసింది. ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, సిహెచ్.లక్ష్మి, ఎ.అజయ్‌కుమారి, తులసి, జవ్వాది శీను వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన మహాసభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి మత విద్వేషాలు రెచ్చగొడుతూ కార్మిక వర్గం ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను చట్టాలను కాలరాస్తూ ప్రభుత్వాలు ఏకపక్షంగా నిర్ణయాలు చేస్తున్నాయని, వీటికి ప్రతిఘటన తప్ప మరో మార్గం లేదని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేయడానికి ఉద్యోగ, కార్మికులు అంగీకరించకపోతే పరిశ్రమలు మూసేస్తామని పాలకులు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, ఇలాంటి బెదిరింపులకు కార్మిక వర్గం భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు వంటి ప్రతిష్టాత్మక పరిశ్రమని అమ్మేస్తుంటే ఆపగలిగే శక్తి నేటి కూటమి పాలకులకు లేదని అన్నారు. ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేయాలని భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని స్కీం వర్కర్లకు వేతనాలు పెంచాలని , పి4 విధానాన్ని రద్దు చేయాలని విశాఖ ఉక్కు విద్యుత్తును ప్రభుత్వమే నిర్వహించాలని మహాసభ తీర్మానాలను ఆమోదించింది. కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చే విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షకులు కలిసి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ కార్మిక హక్కులు, చట్టాలు ఎవరి భిక్షా కాదని హెచ్చరించారు. ప్రభుత్వాలు ఇప్పుడు యజమానులకు అనుకూల చట్టాలు చేశాయని మరోసారి కార్మిక వర్గం ఉద్యమాలు చేసి కార్మికుల అనుకూల చట్టాలను అమల్లోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రూపొందించిన లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఇప్పుడు యజమానుల అనుకూలమైన చట్టాలు చేశాయని, మరోసారి కార్మిక వర్గం ఉద్యమాలు చేసి కార్మికుల అనుకూల చట్టాలను అమల్లోకి తెచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మహాసభలో భవిష్యత్తు కర్తవ్యాలను కె.రాజా రామ్మోహన్‌రాయ్ వివరించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా నాయకురాలు కె.పద్మజ మాట్లాడారు. కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, ఎం.ఆంజనేయులు, ఎం.త్రిమూర్తులు, డి.కళ్యాణి, తెలగంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు లోగోను ఆవిష్కరిస్తున్న నేతలు

సిఐటియు జిల్లా నూతన కమిటీ ఎన్నిక..

ఎన్నికైన నాగేశ్వరరావు, వాసుదేవరావు

సిఐటియు జిల్లా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కర్రి నాగేశ్వరరావు, బి.వాసు దేవరావు, కోశాధికారిగా పివి.ప్రతాప్, ఉపాధ్యక్షులుగా జెఎన్‌వి.గోపాలన్, ఎం.సూరిబాబు, ఎస్.రంగారావు, తెలగంశెట్టి సత్యనారాయణ, ఎస్.వెంకటేశ్వరరావు, కె.ఝాన్సీ, కె.రాజా రామ్మోహన్ రాయ్, గొర్ల రామకృష్ణను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా ఎం.త్రిమూర్తులు, డి.కళ్యాణి, ఎం.ఆంజనేయులు, మహమ్మద్ హసీనా, కె.రామకృష్ణ, చింతపల్లి లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో 61 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రూ.97.29 కోట్ల పింఛన్ల పంపిణీకి సిద్ధం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో 2,25,132 మంది లబ్ధిదారులకు రూ.97.29 కోట్ల సామాజిక పింఛన్ల పంపిణీకి సిద్ధం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పింఛన్లను డిసెంబర్ 1వ తేదీ ఉదయం నుంచి లబ్ధిదారులకు పంపిణీకి సచివాలయ సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి సకాలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు.

1100 సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కారానికి మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయొచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

పలుచోట్ల చిరుజల్లులు

రైతుల ఆందోళన

ఉండిలో ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - ఉండి

దిత్వా తుపాను కారణంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి మండల వ్యాప్తంగా తేలికపాటి జల్లులు కురవడంతో రైతాంగం అప్రమత్తమైంది. పట్టుబడి పట్టిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమైంది. ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారంలో ఊడ్చిన పొలంలోని ధాన్యాన్ని జల్లులు కురవడంతో సంచుల్లోకి పట్టుబడి పట్టి మిల్లులకు తరలించే పనిలో రైతు వెంకటేశ్వరరాజు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అధికారులు వర్షాలు కురిసే అవకాశం ఉందని కోతలు మానుకోవాల్సిందిగా సూచనలు ఇచ్చారని, కోసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు తరలించాలని చెప్పడంతో తాము ధాన్యాన్ని పట్టుబడి పట్టి మిల్లుకు తరలించే లోగా తేలికపాటి జల్లుల కురుస్తున్నాయని అన్నారు.

మొగల్తూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాను ప్రభావంతో మండలంలోని గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం నుండి చిరుజల్లు కురిసింది. చల్లని గాలులు వీసాయి. దీంతో ప్రజలు బయటికి వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో వ్యాపార లావాదేవీలు నిలిచిపోయాయి.

ఆచంట : ఆచంట గ్రామంలో ఆదివారం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై చిరుజల్లు కురిసింది. ఈ నేపథ్యంలో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ఒక పక్క ఆకాశం మేఘావృతమై చిరుజల్లు కురవడంతో ఆందోళన చెందుతున్నారు. ఆరబెట్టుకున్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమైయ్యారు. దీంతో రాత్రిపూట చలిగాలులతో రహదారులు ఈ వర్షానికి చిత్తడిగా మారాయి.

సిఎం సారూ.. వరిసాగు నేరమా..!

కొల్లేరు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న అటవీ శాఖాధికారులు
వందల ఏళ్ల నుంచి వరిసాగు చేస్తున్నా పొలాలకు రాకుండా ఆంక్షలు
ఆ భూములన్నీ సన్న, చిన్నకారు రైతుల చేతుల్లోనే
ఉంగుటూరు నియోజకవర్గంలోనే దాదాపు 3 వేల ఎకరాల్లో సాగు
ఏలూరు, పశ్చిమలో లక్షా 40 వేల మందికి కౌలుకార్డులు
'అన్నదాత సుఖీభవ' కింద చిల్లిగవ్వ ఇవ్వని పరిస్థితి
అన్ని స్థానాల్లో గెలిపిస్తే ఇదేనా గిఫ్ట్ అంటూ అన్నదాత ఆవేదన
నేడు ఉంగుటూరు మండలంలో సిఎం పర్యటన

సిఎం పర్యటన కోసం ఏర్పాటు చేసిన హెలీప్యాడ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సిఎం సారూ.. వరి సాగు చేయడం నేరమా.. వందల ఏళ్ల నుంచి వరిసాగు చేసుకుంటున్న కొల్లేరును ఆనుకుని ఉన్న భూముల్లోకి రైతులను వెళ్లనీయకుండా అటవీ శాఖాధికారులు అడ్డుకోవడం ఎంత వరకూ న్యాయం. ఏడాదికి ఒక్క పంట పండే ఆ భూములే పేద రైతులకు ఆధారం. 'రబీ సాగు సమయం ఆసన్నమవుతున్న తరుణంలో అటవీ శాఖాధికారుల తీరు అత్యంత దారుణంగా ఉంది. 'మాకు న్యాయం చేయండి' అంటూ ఉంగుటూరు నియోజకవర్గంతోపాటు కొల్లేరును ఆనుకుని వరిసాగు చేసుకుంటున్న రైతులంతా సిఎంను కోరుతున్నారు. సోమవారం ఉంగుటూరు మండలంలో సిఎం పర్యటన నేపథ్యంలో కొల్లేరు రైతులంతా తమ ఆవేదనను సిఎం దృష్టికి తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులను, జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీలో సిఎం చంద్రబాబు ఏదోక జిల్లాలో పాల్గొంటున్నారు. డిసెంబర్ నెలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సోమవారం సిఎం చంద్రబాబు ఉంగుటూరు మండలంలో పాల్గొనున్నారు. దీంతో ఆ ప్రాంత రైతులంతా తమ సమస్యలకు పరిష్కారం చూపాలని సిఎంను కోరుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలుతోపాటు దెందులూరు, ఏలూరు మండలాల్లోనూ కొల్లేరును ఆనుకుని ఉన్న భూముల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. 1980 ప్రాంతంలో అప్పటి ప్రభుత్వమే కొల్లేరును ఆనుకుని ఉన్న భూములను సొసైటీ పేరుతో పేదలకు ఇచ్చింది. తర్వాత కాలంలో చాలా గ్రామాల్లో చేపల చెరువులు తవ్వగా 2005లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో అప్పటి ప్రభుత్వం ధ్వంసం చేసింది. నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లోని పలు గ్రామాల్లో మాత్రం ఇప్పటికీ వ్యవసాయం సాగు చేస్తున్నారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం సాంప్రదాయ వ్యవసాయం చేసుకునే అవకాశం ఉంది. నిడమర్రు మండలం అడవికొలనులో 750 ఎకరాల వరకూ అన్‌సర్వే భూమి ఉండగా, పెదనింద్రకొలను, తోకలపల్లి, బైనేపల్లి వంటి గ్రామాలతోపాటు ఉంగుటూరు మండలం అప్పారావుపేట వంటి గ్రామాల్లోనూ అన్‌సర్వే భూములు ఉన్నాయి. ఉంగుటూరు నియోజకవర్గంలో దాదాపు మూడు వేల ఎకరాల వరకూ అన్‌సర్వే భూములు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ భూములన్నీ చిన్న, సన్నకారు రైతుల చేతుల్లోనే ఉన్నాయి. వందల ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇబ్బందీ లేదు. ప్రస్తుత రబీలో ఆ పంట పొలాల్లోకి వెళ్లనీయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద వేలాది మంది రైతులు ఆందోళన చేసిన పరిస్థితి ఉంది. స్థానిక ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నా పరిస్థితిలో మాత్రం మార్పు రాలేదు. రెండు రోజుల క్రితం తోకలపల్లి గ్రామంలో రైతులను అటవీశాఖ అధికారులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. సిఎం జోక్యం చేసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కొల్లేరు రైతులు కోరుతున్నారు.

కౌలురైతులకు 'అన్నదాత సుఖీభవ' ఏదీ..!

తాము అధికారంలోకి వస్తే కౌలురైతులకు న్యాయం చేస్తామని గడిచిన ఎన్నికల్లో కూటమి చెప్పింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటిపోయింది. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం నిర్ధారించిన లెక్కలే ఇవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌలురైతుల సంఖ్య కుదించేసిన పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో 75 వేల మందికి, పశ్చిమలో లక్షా ఐదు వేల మందికి మాత్రమే కౌలు కార్డులు ఇవ్వాలని అధికారులు టార్గెట్ నిర్దేశించారు. ఈ ఏడాది రెండు జిల్లాల్లో లక్షా 40 వేల మందికి కౌలు కార్డులు అందించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అన్నదాత సుఖీభవ కింద ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చింది. కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వమే ఆ మొత్తాన్ని చెల్లిస్తుందని ప్రకటించింది. ఇప్పటి వరకూ రెండు విడతలుగా అన్నదాత సుఖీభవ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సొమ్ము అందుకున్నవారిలో ఒక్క కౌలురైతూ లేడు. ప్రభుత్వం కౌలుకార్డులు జారీ చేసిన లక్షా 40 వేల మందిలో ఒక్కరికీ అన్నదాత సుఖీభవ సొమ్ము అందలేదు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అత్యధికంగా కౌలురైతులు ఉండటంతో గడిచిన ఎన్నికల్లో అంతా కూటమివైపు నిలబడ్డారు. దీంతో రెండు జిల్లాల్లోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. తీరా అధికారంలోకి వచ్చాక కౌలురైతులను పట్టించుకోని పరిస్థితి కన్పిస్తోంది. కౌలురైతులకు వెంటనే అన్నదాత సుఖీభవ సొమ్ము అందించాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, బీమా సైతం అందేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నల్లీక్రీక్ పూడికతీత పనులతో..

ముంపు సమస్య పరిష్కారం

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - నరసాపురం

తీర ప్రాంత గ్రామాల ప్రజలు చిరకాలంగా కోరుతున్న నల్లీక్రీక్ పూడిక తీత పనులు చేపట్టడం ద్వారా తీర ప్రాంత గ్రామాలు, పొలాల ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పెదమైనవానిలంకలో రూ.12.50 కోట్లతో చేపట్టే నల్లీక్రీక్ పూడికతీత పనులను ఆయన ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, కూటమి నాయకులతో ఆదివారం భూమి పూజ చేశారు. అనంతరం ఎంఎల్‌ఎ నాయకర్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధిని గత ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. జగన్ గతంలో నరసాపురం పర్యటన సందర్భంగా అనేక అభివృద్ధి పనులు చేపడతామని అనేక బటన్లు నొక్కారన్నారు. వాటిలో ఏ పనులూ పూర్తికాలేదని వాటితో పాటు నల్లీక్రీక్ పూడికతీత పనులు చేపట్టకపోవడమే ఉదాహరణ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు కేటాయించి నల్లీక్రీక్‌లో పూడిక తీత, గట్ల బలోపేతం, చినమైనవానిలంకలో నల్లీక్రీక్‌పై మొంథా తుపానులో కొట్టుకుపోయిన వంతెన నిర్మాణం చేపట్టేలా నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నల్లీక్రీక్ పూడికతో 12.6 కిలో మీటర్ల మేర 8 గ్రామాలు నిత్యం ముంపునకు గురవుతున్నాయన్నారు. పూడిక తీత పనులతో 11,430 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసే వరి, కొబ్బరి, రొయ్యల పంటలకు ముంపు నుంచి మోక్షం కలుగుతుందన్నారు. గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోని నరసాపురం నియోజకవర్గంలోని మాధవాయపాలెం, వెస్టుకుక్కిలేరు, ఈస్టుకుక్కిలేరు స్లూయిజ్ ఆధునీకికరణకు రూ.8 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. ఎంఎల్‌ఎ నాయకర్ మాట్లాడుతూ నల్లీక్రీక్ పూడిక పనులను గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. జగన్ ఐదేళ్లు సీఎంగా పని చేసి నాలుగు గోడల మధ్య ఉంటూ ప్రజల క్షేమాన్ని విస్మరించారన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, జిల్లా మత్స్యకార సంఘాల సమాఖ్య అధ్యక్షుడు మైల వసంతరావు, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి, జల వనరుల శాఖ ఎస్ఇ సిహెచ్ దేవ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాజానికి గురజాడ ఆదర్శం

వర్ధంతి కార్యక్రమంలో వక్తలు


పెనుగొండలో నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తన రచన ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప కవి గురజాడ అప్పారావు అని తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆయన రచనల ద్వారా సాంఘిక సంస్కరణకు కృషి చేశారన్నారు. ఇది తెలుగు సాహిత్యానికి ఆధునికతను తీసుకొచ్చిందని, ఆయన ముఖ్య రచనలలో కన్యాశుల్కం నాటకం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. గరికపాటి బాపయ్య శర్మ మాట్లాడుతూ గురజాడ అప్పారావు గురించి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌ఛార్జి వైవి.సాయిబాబు, ఎ.జనార్ధన్ రావు, ప్రసాద్, రీడర్స్, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

పెనుగొండ : దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అని వెలుగెత్తి చాటిన తెలుగు వైతాళికులు గురజాడ అప్పారావు 110 వ వర్ధంతి పెనుగొండలో జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కమిటీ ఉపాధ్యక్షురాలు కేత పద్మజ మాట్లాడుతూ గురజాడ అప్పారావు విశాఖ జిల్లా రాయవరం గ్రామంలో 1862 సంవత్సరంలో సెప్టెంబర్ 21న జన్మించారన్నారు. తెలుగు వాడుక భాష నాటకాలు, గేయాలు, గేయకథలు, నవలలు రచించిన మొదటి కవి, గొప్ప సంఘ సంస్కర్త గురజాడ అన్నారు. కన్యాశుల్కం దురాచారాన్ని ప్రతిఘటిస్తూ కన్యాశుల్కం నాటకాన్ని, బాల్యవివాహాలు వ్యతిరేకిస్తూ పూర్ణమ్మ గేయకథను, దేశంలో కుల, మత, వర్ణ విభేదాలు తొలగిపోవాలని 'దేశమును ప్రేమించుమన్నా' గేయాన్ని ఇవే కాకుండా అనేక రచనలు చేసి ఆ రచనల ద్వారా ఆనాటి దురాచారాలకు వ్యతిరేకంగా ప్రజలను జాగృత పరిచారన్నారు. కార్యక్రమంలో ఎన్.భవాని, జి.లక్ష్మి, ప్రియాంక, జి.మేఘనా, జి.అనూష, పి.ఆదిలక్ష్మి, వి.పద్మావతి, ఎన్.వసంత, బి.అనంతలక్ష్మి, ఎస్.గంగారత్నం, పి.దుర్గాభవాని మొదలైనవారు పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు : సాంఘిక పరివర్తనకు కృషిచేసిన మహాకవి గురజాడ అప్పారావు నేటి సమాజానికి ఆదర్శమని ఐద్వా నాయకులు బి.కళ్యాణి అన్నారు. మహాకవి గురజాడ అప్పారావు 110వ వర్ధంతి సందర్భంగా స్థానిక చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం జవహర్ పేటలో చిన్నారులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ చిన్నారుల పసి హృదయాల్లో దేశ భక్తిని నింపాలన్నారు. కుల, మత భేషజాలు లేకుండా వారి మనసులను వికసింప జేయాలని తెలిపారు. దేశమును ప్రేమించుమన్నా - మంచి అన్నది పెంచుమన్నా అనే గురజాడ గేయాన్ని పిల్లలు తమ హృదయంలో నింపుకొని దేశానికి సేవ చేయాలని, అభ్యుదయ భావాలు అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో చిన్నారులు ఎం.వినయ్, పి.షణ్ముఖ, పి.పూజిత, చెన్న సహస్ర, చెన్నా జశ్విన్ పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలు అరికట్టాలి

కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

రైతులతో మాట్లాడుతున్న రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం కొనుగోలుపై అధికారులు ఎన్ని ప్రకటనలు చేసినా తూకాల్లో మోసాలు, తేమశాతం పేరుతో దోపిడి ఆగడం లేదని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. జిల్లాలో పెనుమంత్ర, ఇరగవరం, పెనుగొండ, పోడూరు మండలాల్లో రామాంజనేయులు పర్యటించి ధాన్యం కొనుగోలు సమస్యలపై రైతులతో మాట్లాడారు. జిల్లాలో పంట దశలో అధిక వర్షాలు, తుపాను కారణంగా వరి పంట దిగుబడి బాగా తగ్గిపోయిందన్నారు. కోసిన వెంటనే పట్టే కొట్టు పట్టు ధాన్యమే ఎకరాకు 20 నుండి 25 బస్తాల వరకు అవుతుందని, అదే ఆరుదల ధాన్యం మరింత దిగుబడి తగ్గుతుందని తెలిపారు. కౌలు కాకుండా పెట్టుబడే ఎకరాకు రూ.30 వేల వరకు అయ్యిందని రైతులు తెలిపారన్నారు. దీనికితోడు ధాన్యం పట్టేటప్పుడు సంచితో కలిపి 40 కేజీల 600 గ్రాములు తూయాల్సి వుండగా అదనంగా మరో 600 గ్రాములు వేసి 41 కేజీల 200 గ్రాములు తూస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులు 60 కేజీల ధాన్యం నష్టపోతున్నారని, ఏ సరుకైనా అదనంగా 50 గ్రాములు కూడా వేయరని, పంటలు పండించే రైతులు, కౌలురైతుల వద్ద వందలాది కేజీలు, వేలాది రూపాయలు దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ధాన్యం మిల్లు వద్దకు వెళ్లాక రైతుసేవా కేంద్రంలో వచ్చిన తేమశాతం ఆమోదించడం లేదని, నాలుగు పాయింట్లు ఎక్కువ చూపించి ధాన్యం కానీ, డబ్బులు కానీ తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తక్షణం ధాన్యం కొనుగోలు ముమ్మరం చేయాలని, కళ్లాల్లో ధాన్యంపై కప్పుకునేలా బరకాలు ఇవ్వాలని, తూకాల్లో మోసాలు, తేమశాతం దోపిడీని అరికట్టి రైతులను కాపాడాలని అధికారులను కోరామన్నారు. ఆయన వెంట కౌలురైతులు గునుపూడి సన్యాసిరావు, గునుపూడి నాగేష్, భాస్కర్ రెడ్డి, సోల శ్రీను, తాడి వీర్రాజు, గొల్ల బుజ్జి పాల్గొన్నారు.

అంగులూరు కొండ వద్ద బొలేరో బోల్తా

ఒకరి మృతి, 14 మందికి గాయాలు

ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో రాజమండ్రి తరలింపు

ప్రజాశక్తి - పోలవరం

తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలం అంగులూరు వద్ద బొలెరో వాహనం బోల్తా పడడంతో ఒకరు మృతి చెందారు. 14 మంది గాయాలపాలయ్యారు. వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన 15 మంది బొలెరో వాహనంలో తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలం గండి పోచమ్మ ఆలయానికి ఆదివారం మధ్యాహ్నం వెళ్లారు. దర్శనం అనంతరం అదే బొలెరో వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. వాహనం అంగులూరు వద్ద ఉన్న కొండ ఎక్కుతుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కె.నరసింహమూర్తి మృతి చెందారు. గాయాలపాలైన 14 మందిని పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఎం.సురేష్, జి.శ్రీనివాసరావులకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం రాజమండ్రి ఆసుపత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలవరం సిఐ బాలసురేష్‌బాబు,హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాసులు పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలవరం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలోని రామారావు పేటకు చెందిన సింగవరపు హేమంత్ కుమార్‌కు 3 సంవత్సరాల బాలుడు కలడు. అబ్బాయికి బ్లడ్ కేన్సర్ వ్యాధితో వైజాగ్‌లోని కేన్సర్ హాస్పిటల్‌లో వైద్యం జరుగుతుంది. విషయాన్ని తెలుసుకున్న మంతెన వెంకటరామరాజు వెంటనే స్పందించి రూ.20 వేలు పంపించగా ఆ డబ్బును పాలకొల్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి.బుద్ధరాజు పేషెంట్ తండ్రికి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మల్ల రవితేజ, తోట శ్రీనివాస్ పాల్గొని ఆర్థిక సహాయం చేసినందుకు మంతెన వెంకటరామరాజుకి కృతజ్ఞతలు తెలియజేశారు.

గౌడలకు సముచిత స్థానం అభినందనీయం

ఎఎంసి చైర్మన్ బొల్లా వెంకట్రావు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామానికి చెందిన గౌడ సామాజిక తరగతికి చెందిన ఇద్దరు మహిళలకు శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధర్మకర్తలుగా నియమించి సముచిత స్థానం కల్పించడం అభినందనీయమని ఎఎంసి చైర్మన్ బొల్లా వెంకట్రావు అన్నారు. కాళ్లకూరు శ్రీవెంకటేశ్వరస్వామి వారిని ఆకివీడు వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ బొల్లా వెంకట్రావు ఆదివారం దర్శించుకున్నారు. ఇటీవల కాళ్లకూరు గ్రామం శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన పాలకమండలి చైర్మన్ అడ్డాల శివరామరాజు, ధర్మకర్తలు కట్టా భువనేశ్వరి, బిటికిని అనంతలక్ష్మిలు నియమితులైన వారిని పూలమాలలు, దుశాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిటికిని సూర్యనారాయణ, ఆరేపల్లి కృష్ణారావు, కట్టా సతీష్ పాల్గొన్నారు.

పాలకొల్లు వాకర్స్ క్లబ్‌కు అవార్డులు

ప్రజాశక్తి - పాలకొల్లు

సమాజానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గాను వాకర్స్ క్లబ్ పాలకొల్లుకు బెస్ట్ క్లబ్, బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ సెక్రటరీ అవార్డులు లభించాయి. ఆదివారం భీమవరం కాస్మో క్లబ్‌లో జరిగిన వాకర్స్ జిల్లా -201 కాన్ఫరెన్స్‌లో వీటిని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం. ప్రభావతి, డిస్ట్రిక్ట్ గవర్నర్ గుంటూరి రామారావులు చేతుల మీదుగా అధ్యక్ష కార్యదర్శులు తటవర్తి సుధాకరరావు, షేక్ పీర్ సాహెబ్‌లు అందుకున్నారు. కార్యక్రమంలో పూర్వ గవర్నర్‌లు ఆకే రామకృష్ణ, జివి. సుబ్బారావు, సభ్యులు కాగిత సూర్యనారాయణ, దాసరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వికలాంగుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పశ్చిమగోదావరి జిల్లా వికలాంగుల సమ్మేళనం ఆదివారం స్థానిక మహిళ కళాశాలలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ వికలాంగులు సేవలు పొందే స్థితి నుండి సేవలు చేసే స్థితికి చేరుకోవాలన్నారు. వారికి గల దివ్యమైన శక్తితో ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి ఎదగాలని పిలుపునిచ్చారు. వికలాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. వికలాంగులు స్వయంగా తయారుచేసిన వస్తువులను ప్రదర్శించారు. డాక్టర్ లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యాన వికలాంగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 15 వేలతో మూడు వీల్ ఛైర్‌లను అర్హులైన వికలాంగులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సక్షమ్ ప్రాంత అధ్యక్షులు శ్రీమన్నారాయణ, ప్రాంత ఉపాధ్యక్షులు ఎవిఎస్.ఎస్.మూర్తి, సక్షమ్ జిల్లా సభ్యులు, ఆర్యా నాగార్జున విశ్వ విద్యాలయం సైన్స్, ఆర్ట్ కళాశాల, ప్రిన్సిపల్ ఎం.సురేష్, వివిధ ప్రతిభావంతుల శాఖ, సహాయ సంచాలకులు బి.రామకుమార్, పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి - పాలకొల్లు

శ్రీదేవెల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల, పాలకొల్లు-ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యాన ఆదిపాలెం గ్రామంలో స్పెషల్ క్యాంప్‌లో భాగంగా నాలుగవ రోజు క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. ఉద్యోగ అవకాశాలపై అవగాహన, ప్లాస్టిక్ వినియోగం నివారించాలని ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు ఇస్తూ ఆదిపాలెం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆదిపాలెం పంచాయతీ సిబ్బంది వాలంటీర్లతో కలిసి ఆదిపాలెం గ్రామంలో ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణంపై వచ్చే ప్రభావం గురించి ర్యాలీగా అవగాహనను గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిపాలెం టిడిపి గ్రామ అధ్యక్షులు చెరుకూరి ఆంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం.రామకృష్ణ, డాక్టర్ వి.విజయలక్ష్మి, తహశీల్దార్ కె.నరేష్, ఎన్ఎస్ఎస్ కమిటీ మెంబర్లు, సిహెచ్.రవికుమార్, డి.హెప్సి రాణి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

ముఖ్యమంత్రి సహాయనిధి రోగుల పాలిట పెన్నిధని ఏపి డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పెదఅమిరంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న 40 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన రూ.22,81,061 సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం లబ్ధిదారులకు అందించారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సకాలంలో బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

3న అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన యాత్ర

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈనెల 3వ తేదీ బుధవారం విజయవాడలో జరిగే అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన యాత్రను జయప్రదం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం శాఖ గౌరవాధ్యక్షులు ఎం.సీతారాంప్రసాద్, అధ్యక్షులు కె.గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుండి వందలాది మందితో ధర్నా చౌక్ వరకు ఆవేదనా యాత్ర జరుగుతుందని, ధర్నా చౌక్‌లో ఆవేదనా దీక్ష చేపడతామని తెలిపారు. అగ్రిగోల్డ్ కంపెనీ 8 రాష్ట్రాల్లో 32 లక్షల మంది డిపాజిట్లను, ఏజెంట్లను నిలువుదోపిడీ చేసిందని వారు నిప్పులు చెరిగారు. మన రాష్ట్రంలో 19.52 లక్షల మంది నుండి రూ.3,986 కోట్లు కొల్లగొట్టారని, సుమారు 600 మంది పైచిలుకు ఆత్మహత్యలు, గుండెపోటుకు, మనోవేదనకు గురై ప్రాణాలు పోగొట్టుకున్నారని వారి ఆవేదన వ్యక్తంచేశారు. అగ్రిగోల్డ్ కేసులో సత్వర పరిష్కారానికి ఈ ఒక్క అంశంపై ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును విజయవాడ కేంద్రంగా సత్వరం ఏర్పాటుచేయాలని, సమగ్ర, నమ్మకం కలిగిన ఉత్తమ అధికారుల బృందంతో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేయాలని, కంపెనీ ఆస్తుల ముట్టడింపు తగినంత వేగంగా పూర్తిచేసి ఆస్తుల అమ్మకాన్ని వేగవంతం చేయాలని అన్నారు. అసోసియేషన్ నాయకులు ఎం.సాయిబాబా పాల్గొన్నారు.

టివి టెక్నీషియన్స్ ఆత్మీయ కలయిక

పాలకొల్లు : పాలకొల్లు ఆడియో, వీడియో టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ కలయిక కార్యక్రమంలో సహపంక్తి భోజనాలు ఆదివారం పాలకొల్లు వీవర్స్ కాలనీలోని సమతా మహిళా విజ్ఞాన భవనంలో అధ్యక్షులు మానెం బసవరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏటిఏయు రాష్ట్ర యూనియన్ ఉపాధ్యక్షులు చెరుకూరి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ టివి టెక్నీషియన్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి కలిసికట్టుగా తీసుకువెళ్లాలని అడ్వాన్స్‌డ్ కోర్సులను ప్రభుత్వాలు ట్రైనింగ్ క్లాసులు ఏర్పాటు చేస్తే టివి టెక్నీషియన్లను మనుగడ, ఉపాధి కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ ట్రస్ట్ బోర్డు మెంబర్ జమీతార చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్.డి సురేష్, సెక్రెటరీ అప్పన్న కాశీ, నల్ల శివకుమార్, కట్టోజు భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం
సెల్: 83339 88814

మారిన వాతావరణం

రైతు గుండెల్లో గుబులు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరంలో ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

వాయుగుండం ప్రభావం వల్ల ఆకాశంలో మబ్బులు ఉండటంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. రైతులకు ధాన్యం చేతికి వచ్చే సమయంలో ఆకాశంలో మబ్బులతో మార్పులు రావటంతో ఆరుగాలం పండించిన ధాన్యాన్ని రక్షించుకోవటానికి ఎక్కడ ధాన్యాన్ని అక్కడే సంచులకు పట్టి మిల్లులకు తోలుకొనే పనిలో ఉన్నారు. ఎకరానికి ముప్పై వేలు ఖర్చు చేసామని రైతులు చెప్పారు. సార్వాలో ఎకరానికి ముప్పై బస్తాలు మాత్రమే దిగుబడి రావటంతో ధాన్యం అమ్మితే ఖర్చులకు సరిపోతాయన్నారు. మిగులు కనపడదని, చేతి డబ్బులు పెట్టుకొనే పరిస్థితి కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పండిన పంట అమ్ముకునే సమయంలో ఆకాశంలో మబ్బుల వల్ల వర్షం పడితే తమకు మిగిలేదేమి ఉండదని చెప్పారు. మండలంలో ఎక్కువ శాతం కౌలురైతుల వల్ల వర్షాలు కురిస్తే మరింత నష్టపోతామని చెప్పారు. ధాన్యం ఏ రేటుకి వెళ్లినా రైతుకు ఒప్పుకున్న ప్రకారం ధాన్యం ఇవ్వాలని, నష్టపోయిన తమకి ప్రభుత్వం నుండి వచ్చే నష్టపరిహారం చేను యజమానికి ఇస్తున్నారని చెప్పారు. తమకి కౌలుకార్డులు ఇవ్వలేదని, ప్రభుత్వం చెప్పేది ఒకటి, చేసేది ఒకటని కౌలురైతులకు న్యాయం జరగటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తేమశాతం పట్టింపు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆకివీడు : వాతావరణం మార్పుతో రైతు మరోసారి దిగాలు పడ్డాడు. వరి, ఆక్వారైతు ఇరువురు ఇక్కడ ఇప్పటికే భారీ స్థాయిలో నష్టపోయారు. గత 15 రోజుల క్రితం వరకు కురిసిన భారీ వానలు వాతావరణ మార్పుతో ఆక్వారైతు రొయ్యలు విపరీతంగా దెబ్బతిన్నాయి. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు రావడంతో రొయ్య విపరీతంగా చనిపోయిందని రొయ్య పెంపకం దారులు ఆవేదన చెందారు. అదే పరిస్థితిలో చేపలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ పరిస్థితిలో రొయ్య చేపల మార్కెట్ విపరీతంగా పడిపోయింది. ఈ పరిస్థితి నుంచి తిరిగి తేరుకునేందుకు ఆక్వారైతు ప్రయత్నం ప్రారంభించాడు. చేపలు, రొయ్యల మేతల ధరలు పెరిగిపోవడం, ఉన్న చేప, రొయ్య చనిపోవడం, మందుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, ఆక్వా ధరలు పడిపోవడం వీటితో ఆక్వారైతు కుదేలవుతున్నాడు. ఇప్పుడు ప్రస్తుతం మరోసారి అదే పరిస్థితి ఏర్పడింది. ఒకపక్క చలిగాలి తగిలి చేపలు తిరగబడిపోతాయని రైతులు కంగారు పడుతున్న దశలో మొత్తం వాతావరణం మారిపోయింది. ఆకాశం పూర్తి మేఘావృతమైంది. ఒకే రకమైన వాతావరణం ఉంటే చేపకు పెద్దగా ఇబ్బంది ఉండదు. అయితే ఉదయం చలి, మధ్యాహ్నం ఎండ, సాయంత్రం వాన ఈ పరిస్థితిలో చేపకు విపరీతమైన నష్టం వస్తుందని రైతులంటున్నారు. పెరగటం కూడా కష్టం అవుతుంది. ఆక్సిజన్ అందదు. ఇదిలా ఉండగా రొయ్యలు భారీగా నష్టపోతాం అంటున్నారు. రొయ్య తిరగబడే ప్రమాదం ఉందనే ఆందోళనతో ఉన్నదైన సొమ్ము చేసుకుందామనే ఆలోచనతో అత్యవసరంగా పట్టుబడి సాగిస్తున్నారు కొందరు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆక్వా రైతు చాలా దారుణమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

వరి రైతు ఆవేదన

ఆకాశం మార్పు రావడంతో వరి రైతు పూర్తిగా దిగాలు పడ్డాడు. గతంలో కురిసిన వానలకు వరి భారీగా దెబ్బతింది. చేలు ఈనిక దశలో ఉన్నప్పుడు గింజపై బరువు పడితే గింజలో ఉన్న పాలు తోడుకునే పరిస్థితి తగ్గిపోతుంది. ఫలితంగా పాలు తోడుకునే కొంతమేర తగ్గడంతో గింజ బరువు తగ్గి దిగుబడి స్థాయి తగ్గిపోతుంది. ప్రస్తుతం ఇక్కడ అదే జరుగుతోంది. మండలంలో సుమారు 3000 ఎకరాలలో దాల్వా పంట సాగవుతుంది. అయితే గత 20 రోజులు క్రితం కురిసిన వానల ప్రభావానికి గింజ బరువు తగ్గి దిగుబడి భారీగా తగ్గే పరిస్థితి ఏర్పడింది. ఈ స్థితిలో సుమారు 70 నుండి 80 శాతం చేలు కోతకు వచ్చాయి. ప్రస్తుతానికి కోతలు జరుగుతున్నాయి. ముందుగా విత్తనాలు పోసినవి ఇప్పటికే కోతలు పూర్తయి గట్టుకు చేరాయి. ఆ కోతల్లో దిగుబడి బాగా తగ్గాయని, 25 నుంచి 28 బస్తాల వరకు మాత్రమే దిగుబడి వచ్చిందని రైతులంటున్నారు. సాధారణంగా సార్వాకు 35 బస్తాలు కనీసంగా దిగుబడి ఉంటుంది. అదే దిగుబడి దాల్వా అయితే 45 వరకు ఉంటుంది. ఈ స్థితిలో దిగుబడి తగ్గడమే కాక పెట్టుబడి మరింతగా పెరిగింది. గాలి, వానకు పడిపోయిన వరిని లేపి కట్టి నుంచో పెట్టడం, కోతకు మిషన్ల వల్ల కాకపోతే రెట్టింపు కూలీలతో పోయించడంతో రైతు ఆర్థికంగా ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. ఈ స్థితిలో కోతలకు వచ్చిన చేలు మరోసారి వానపాలైతే ఇక సార్వా పంట రైతు చేతికి చిక్కడం ఉత్తమాట. ఒకవేళ వచ్చినా నామ మాత్రమే. ఈ పరిస్థితుల్లో రైతు ఆవేదనలో పడ్డాడు.

మొగల్తూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాను ప్రభావంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సాగు చేతికందే సమయంలో రైతన్నలను తుపానులు వెంటాడుతున్నాయి. గతనెల ఆఖరులో సంభవించిన తుపానుతో వరిచేలకు కొంతమేర నష్టం వాటిల్లింది. తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. దీంతో పంట చేతికి అందుతుందా, లేదా అని అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నియోజకవర్గంలో వరిసాగు అన్నదాతలు సుమారు ఆరువేల ఎకరాల్లో సార్వ సాగు చేస్తున్నారు. పలు చేలు కోత దశకు వచ్చాయి. వాతావరణ భయంతో వరి కోతలు చేసి ఒబ్బిడి చేసేందుకు రైతులు ఒక్కసారిగా చర్యలు చేపట్టారు. దీంతో కూలీలకు కొరత ఏర్పడింది. పలు చేల్లో వరికోత యంత్రాలు నడిచే పరిస్థితి లేదు. దీంతో కార్మికులతో మూసూలు చేయాల్సి ఉంది. కూలీల కొరతతో కోత, కట్టేత, నూర్పిళ్లు పూర్తిచేసేందుకు రైతులు కూలీలకు గుత్తకు ఇస్తున్నారు. కల్లం పక్కనే ఉన్న ఎకరం చేలో వరి ఒబ్బిడి చేసేందుకు రూ.12 వేలు, ఆపై చెల్లించాల్సి వస్తుంది. కల్లాలకు దూరంగా ఉన్న చేల ఒబ్బిడి చేసేందుకు దూర భారాన్ని బట్టి ఎకరాకు రూ.15 వేలు, ఆపై చెల్లించాల్సి వస్తుందని, దిగుబడులు మాత్రం ఎకరాకు 20 నుంచి 25 బస్తాలు మాత్రమే వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. దీంతో సొంతభూమిలో సాగు చేసిన రైతులకు రూ.10 వేల వరకూ, కౌలు రైతులకు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకూ నష్టం వాటిల్లే ప్రమాదం తలెత్తిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నెగ్గిపూడి, మార్టేరు, వనంపల్లి, వెలగలేరు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వైసిపి నాయకులు అల్లం సత్యనారాయణ రెడ్డి, జక్కంబాబు, గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి, తోలేటి సత్య రఘు లక్ష్మి, చెల్లూరి ఆదిమూర్తి కుటుంబ సభ్యులను ఆదివారం ఉదయం మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు పరామర్శించారు. గ్రామాల్లోని వారి గృహాలకు వెళ్లి మృతుల చిత్రపటాలకు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన వెంట వైసిపి మండల మాజీ కన్వీనర్, మార్టేరు ఉప సర్పంచి కర్రి వేణుబాబు, ఆచంట నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు కీర్తి కనకయ్య, ఆయా గ్రామ కమిటీల అధ్యక్షులు అల్లం బాలసాయిరెడ్డి, చిర్ల సత్యనారాయణ రెడ్డి, ఎంపిటిసి సభ్యుడు గుడిమెట్ల లక్ష్మణ రెడ్డి, సొసైటీ మాజీ ఛైర్మన్ కొవ్వూరి పుల్రా రెడ్డి, అల్లం బుల్లి రెడ్డి, తోలేటి శ్రీనివాస్, పడాల కేశవరెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సత్తి సత్యనారాయణ రెడ్డి, తాడి ఫణికుమార్ రెడ్డి, కర్రి సత్యప్రకాష్ రెడ్డి, కొవ్వూరి మోహన్ రెడ్డి, సత్తి సత్తిరెడ్డి, గుడిమెట్ల పురుషోత్తమ రెడ్డి, నేదురు జీవరత్నం, దొంగ వెంకన్న, సివంగుల దుర్గారావు, కృష్ణ పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యాన మరిన్ని సేవలు

జిల్లా నాయకులు వినాయక

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని మానవత ఆధ్వర్యాన ప్రజలకి మరిన్ని సేవలందించడానికి మనవత సంస్థ సిద్ధంగా ఉందని సంస్థ జిల్లా నాయకులు కాకర్లవినాయక అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో నెలవారీ ఖర్చులు, శాంతిరథం మరమ్మతులు, నూతనంగా ఏర్పాటు చేసే ఫ్రీజర్‌పై ఆయన మాట్లాడారు. నూతన సంవత్సరం డైరీకి సంబంధించిన యాడ్స్ తీసుకోవటం జరిగిందని చెప్పారు. సంస్థ ఆధ్వర్యాన చేస్తున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు గంటా అన్నవరం, బుద్ధారపు పుల్లయ్య, కంతేటి కృష్ణంరాజు, బంగారాజు, ఆంజనేయులు, నారాయణ, రంగారావు, అర్జున్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి

డిప్యూటీ ఎంపిడిఒ పివి.నరసింహమూర్తి

ప్రజాశక్తి - ఇరగవరం

గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు డిప్యూటీ ఎంపిడిఒ పివి.నరసింహా మూర్తి తెలిపారు. ప్రతి వారం పంచాయతీ కార్యదర్శులంతా మండలంలోని ఒక గ్రామంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. దుకాణాలు తనిఖీ చేసి ప్లాస్టిక్ కవర్లు అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

400 మందికి వైద్య పరీక్షలు

వీరవాసరం: ఉచిత వైద్యశిబిరాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వీరవాసరం కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ అన్నారు. ఆయన అధ్యక్షతన నిర్వహించిన సభలో పలవురు వక్తలు మాట్లాడుతూ వ్యవప్రయాసాలతో ఆసుపత్రులకు వెళ్లి మన వద్దకు వచ్చి నిర్వహించే ఇటువంటి వైద్యశిబిరాలను వినియోగించుకోవాలన్నారు. తమ వినాయక ఆసుపత్రిలో నిర్వహించే వైద్యపరీక్షలు, వైద్య సదుపాయాలను వైద్యులు వివరించారు. వీరవాసరం కాపు వనితా క్లబ్, కాపు క్లబ్, వీరవాసరం కళాపరిషత్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్యశిబిరంలో నాలుగు వందల మంది వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వీరవల్లి చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు, వీరవాసరం సొసైటీ ఛైర్మన్ వీరవల్లి శ్రీనివాసరావు, గుద్దటి స్వామీజీ, పాలా ఆంజనేయులు, వినాయక ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు సిపిఎం నేతల పరామర్శ

యలమంచిలి : మండలంలోని ఏనుగువానిలంక గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నేత ఇంటి వెంకటేశ్వరరావు ఇటీవల మోటారు సైకిల్ ప్రమాదంలో కాలుకు ప్రాక్చర్ కావడంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సిపిఎం నాయకులు వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, నాయకులు మాసవరపు సుబ్బారావు, మొమ్మిడివరపు ఆంజనేయులు, తెన్నేటి స్టాలిన్, పల్లేరు వెంకటస్వామి పాల్గొన్నారు.

ప్రారంభమైన వాలీబాల్ పోటీలు

నరసాపురం: స్థానిక శ్రీవైఎన్ కళాశాల శారీరక విద్య విభాగం ఆధ్వర్యాన ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయ పరిధిలో అంతర కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అందే రామ సతీష్ పోటీలను ప్రారంభిస్తూ ప్రతీ విద్యార్థి విద్యతో పాటు ఆటలు కూడా ఆడాలని, అప్పుడే మానసిక వికాసంతో పాటు శారీరక దృఢత్వం కలిగి ఎటువంటి పోటీ పరీక్షలకైనా సిద్ధంగా ఉంటారన్నారు. వివిధ కళాశాలల నుండి మొత్తం 26 జట్లు విచ్చేశారు. విశ్వ విద్యాలయం నుండి పరిశీలకులుగా డాక్టర్ ఎస్‌విఎల్‌జి.వర్మ, డాక్టర్ జి. పవన్ కుమార్ రాజు, ఎన్.యువరాజు విచ్చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు అధ్యక్షత వహించగా, కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యులు డాక్టర్ కెఎస్‌పి.నారాయణ వర్మ పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి డిప్యూటీ స్పీకర్ కృషి అభినందనీయం

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు ఎంపిపి చంటి రాజు

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి చంటి రాజు

ఉండి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు చేస్తున్న కృషి అభినందనీయమని పాలకోడేరు ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు(చంటి రాజు) అన్నారు. పెన్నాడ అగ్రహారం పుంత రోడ్డును మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఎంపిపి చంటిరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని తనదైన శైలిలో అన్ని విధాలుగా డిప్యూటీ స్పీకర్ ఎంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. సమస్య వస్తే దాని పరిష్కారానికి చక్కటి మార్గాన్ని ఉంచి, సమస్యలు పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న డిప్యూటీ స్పీకర్ చేస్తున్న కృషికి తమ వంతు అన్ని విధాల అండదండగా ఉంటామని తెలిపారు. ఆయన చేస్తున్న అభివృద్ధి, చేపట్టే ప్రతి కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ వెంటే ఉండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిల్లా అనూష సత్యనారాయణ, ఎంపిటిసిలు ఆదాడ లక్ష్మీ తులసి, పెద వెంకటస్వామి, వార్డు సభ్యుడు బ్రహ్మాజీ, రైతులు నాగరాజు వర్మ, పంచాయతీరాజ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వర్మ, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సేవలు భేష్

ప్రజాశక్తి - కాళ్ల

నూతన షెడ్డును ప్రారంభిస్తున్న నాగరాజు

కాళ్లకూరు గ్రామంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ సేవలు ద్వారా డాక్టర్ దాట్ల వెంకట రామరాజు అందిస్తున్న సేవలు అభినందనీయమని కాళ్లకూరు దేవస్థాన మాజీ ఛైర్మన్ అడ్డాల నాగరాజు అన్నారు. ఆదివారం కాళ్లకూరు గ్రామంలో సమాధుల తోటలో నూతన షెడ్డును ప్రారంభోత్సవం చేశారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ దాట్ల వెంకట రామరాజు లక్షరూపాయల ఆర్థిక సాయంతో షెడ్డును నిర్మించారు. 50 వేల రూపాయల ఆర్థిక సహకారంతో 1000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు దాట్ల శ్రీదేవి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దాట్ల వెంకట రామరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాళ్లకూరు సొసైటీ ఛైర్మన్ దండు ప్రణవమూర్తిరాజు, పాస్టర్లు దొడ్డిరాజారత్నం, ఎస్.ఇమ్మానియేలు, సోడదాసి గంగయ్య, దావులూరి సామ్యూల్, బొండాడ బాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా యుటిఎఫ్ మండల మహాసభ

ప్రజాశక్తి - వీరవాసరం



ప్రమాణం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ భవనంలో యుటిఎఫ్ మండల మహాసభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ భవన స్థల దాత కీర్తిశేషులు మద్దాల శ్రీరంగనాయకులు చిత్రపటాన్ని వారి కుమారులు సత్యనారాయణమూర్తి, వీరవాసరం మండల మాజీ అధ్యక్షులు వీరవల్లిచంద్రశేఖర్ ఆవిష్కరించారు. యుటిఎఫ్ జెండాను సీనియర్ నాయకులు నుదురుపాటి భానుమూర్తి ఆవిష్కరించారు. ముందుగా యుటిఎఫ్ అమరవీరుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. 51 వసంతాల యుటిఎఫ్ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో పోరాటాలు, సాధించిన విజయాలు గురించి పాల్గొన్న వ్యక్తులు కొనియాడారు. ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న బోధనేతర కార్యక్రమాల వల్ల బోధనకు ఆటంకం కలుగుతుందని, ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అన్నారు. ఐక్య పోరాటాలు చేయడంలో యుటిఎఫ్ పాత్ర మరువలేనిదని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం కొనియాడారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని జిల్లా కోశాధికారి పి.క్రాంతికుమార్ తెలియజేశారు. తదనంతరం నూతనంగా ఏర్పడిన వీరవాసరం మండల కమిటీ గౌరవ అధ్యక్షులుగా కె.నాగమనేశ్వరరావు, అధ్యక్షులుగా ఎన్.ప్రసాద్ బాబు, అసోసియేట్ అధ్యక్షులుగా బోను అచ్చియ్య, మహిళ అసోసియేట్ అధ్యక్షురాలుగా కె.రాజమణి, కోశాధికారిగా మరడాని దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా ఎంఎంఎస్‌సిహెచ్.శ్రీనివాసరావు, సిపిఎస్ మండల కన్వీనర్‌గా నడపన దుర్గారావు ఎంపికైయ్యారు. వీరితోపాటు మరో పదిమంది కార్యదర్శులుగా ఎంపికైయ్యారు. ఎన్నికల అధికారిగా సిహెచ్.పట్టాభి రామయ్య, పరిశీలకులుగా క్రాంతి కుమార్ వ్యవహరించారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థలదాత కుమారులు సత్యనారాయణ మూర్తి, మాజీ మండల అధ్యక్షులు వీరవల్లి చంద్రశేఖర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పంపన సాయిబాబుని మండల కమిటీ ఘనంగా సన్మానించారు. గతంలో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఉపాధ్యాయ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంను దిగ్విజయం చేసిన మండల, జిల్లా నాయకులకు ప్రధాన కార్యదర్శి ధన్యవాదాలు తెలియజేశారు.

ఏసు మార్గం అనుసరణీయం : కలెక్టర్

ఉండి: ఏసు మార్గం అనుసరణీయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ఆదివారం ఉండి మండలం వాంద్రం గ్రామంలోని సెయింట్ జాన్ లూథరన్ చర్చ్ పదవ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ నాగరాణి పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల ద్వేషంతో ఉండకుండా ప్రేమ, అనురాగంతో ఉండాలని సూచించారు. చిన్నారులు బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుడు కోణాల రవి కుమారుడు ఇటీవల అనారోగ్యానికి గురైతే కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపించి మెరుగైన చికిత్స అందించడంతో ఆ చిన్నారి కోలుకున్నాడని దీనివల్ల గ్రామస్తులంతా కలిసి కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రవీణ్ కుమార్, గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.చిన్నారావు, సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ

పాలకొల్లు రూరల్: పాలకొల్లు నియోజకవర్గంలో మూడుసార్లు ఎంఎల్ఎగా గెలిపించిన తన కుటుంబ ప్రజల రుణం తీర్చుకునేలా అభివృద్ధి, సంక్షేమాన్ని అందించాలనే ఉద్దేశంతో పని చేస్తున్నానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని భగ్గేశ్వరంలో 10 లక్షలతో తాగునీటి వసతి పనులకు శంకుస్థాపన, కాపవరంలో 50 శాతం సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ కార్యక్రమంలో ఆయన కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలకు అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఎఎంసి ఛైర్మన్ కోడి విజయభాస్కర్, తహశీల్దార్ ఎడ్ల దుర్గ కిషోర్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయండి

ప్రజాశక్తి - పెనుగొండ

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రూపొందించిన లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. ఆదివారం లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ పెనుగొండలో వర్షంలో తడుస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పెనుగొండ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల శ్రమను దోపిడీ చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లపై కార్మిక కర్షక లోకం రోడ్డెక్కాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జెఎన్‌వి.గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, రంగారావు సూరిబాబు, వెంకటేశ్వరరావు, కేతా గోపాలన్, పద్మ, అజయ్‌కుమారి, రాజా రామ్మోహన్‌రాయ్, త్రిమూర్తులు, కళ్యాణి, రంగారావు, గంగారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో సత్తెమ్మ గుడి నిర్మాణం

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారాంపురం, రాజులపాలెం గ్రామం వద్ద ప్రభుత్వ స్థలం ఆక్రమించుకుని ఒహెచ్‌ఆర్ ట్యాంక్ వద్ద సత్తెమ్మ గుడిని కొందరు ప్రయివేట్ వ్యక్తులు నిర్మించారంటూ చెరుకూరి మాధవి, సత్య వరప్రసాద్ రాజులు ఎపి, తెలంగాణ హైకోర్టులో గత డిసెంబర్లో పిటీషన్ వేశారు. న్యాయవాది గొట్టుముక్కల రోనాల్డ్ రాజు ద్వారా ఈ పిటిషన్ వేశారు. హైకోర్టు చట్ట ప్రకారం వ్యవహరించి ప్రభుత్వ పోరంబోకు స్థలంలో నిర్మించిన దేవతామూర్తుల విగ్రహాలు, గుడిని తొలగించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు చెరుకూరి సత్యవరప్రసాద్ చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, స్థానికులకు జరుగుతున్న ఇబ్బందుల వల్ల మాత్రమే తమ కుటుంబ సభ్యులతో కలిసి పిటీషన్ వేసామని, ఇందులో స్వార్థం, మతపరమైన అంశం ఏమి లేదని సత్యవరప్రసాద్ వెల్లడించారు.

ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలి

డాక్టర్ రంగరాజు

ఉండి: సమాజంలో ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవనం సాగించాలని ఉండి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. ఉండి సిపిఎం కార్యాలయంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ ప్రతిభ కలిగి ఆర్థికంగా వెనుకబడిన వారికి మానవత చేయూతనిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. మానవతలో సభ్యులుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మండల ఛైర్మన్ రుద్రరాజు యువరాజు మాట్లాడుతూ గోరంత ఓదార్పు కొండంత మానసిక ధైర్యం ఇస్తుందని, అదే మానవత సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. మండల కన్వీనర్ కొమ్మన నాగబాబు మాట్లాడుతూ ఫ్రీజర్ బాక్స్ అవసరమైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, పెదపుల్లేరు ఎంపిటిసి రాయి రాములమ్మ, ఆర్ఎస్ బాబు, పెన్మెత్స రంగప్రసాదరాజు, పిల్లలమర్రి శ్యామలరావు, ఎం. రాము పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువలో పాలన

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గంలోని ప్రజలకు మరింత చేరువలో పరిపాలన అందించేందుకు కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పెదఅమిరంలోని ఆయన కార్యాలయంలో నియోజకవర్గ ప్రజాసమస్యల పరిష్కారానికి ఆదివారం 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని 4 మండలాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకొని సంబంధిత శాఖల అధికారులకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

కార్యకర్త కుటుంబానికి బీమా చెల్లింపు

భీమవరం టౌన్: భీమవరం పట్టణంలోని 29వ వార్డుకి చెందిన టిడిపి కార్యకర్త బండి లక్ష్మణకుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతని కుటుంబానికి రూ.5 లక్షల బీమా నగదును టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి చేతులమీదుగా అందజేశారు. ఆదివారం భీమవరం నియోజవర్గ టిడిపి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ భీమవరం పట్టణం ప్రకాష్ నగరకి చెందిన టిడిపి కార్యకర్త బండి లక్ష్మణ్ కుమార్ టిడిపి రూ.100 సభ్యత్వం తీసుకోవడం జరిగిందని, ఆయన జూన్‌లో నర్సాపురం పట్టణంలో రోడ్డు ప్రమాదానికి గురై మరణించడంతో బీమా నగదు అందజేసినట్లు తెలిపారు. గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పామర్తి వెంకటరామయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కలిదిండి సుజాత రామచంద్రరాజు, టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము, చల్లబోయిన గోవింద్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

GODI PEDDA RAJU అనునాకు విశాఖపట్నం పాస్ పోర్టు కార్యాలయం అధికారులు ది.25-05-2011న J6381597 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ తీయించుకునేందుకు మా ఇంటి నుండి నరసాపురం టౌన్‌లోని మెయిన్‌రోడ్‌కు వస్తుండగా నా ఒరిజినల్ పాస్ పోర్టు పోయినది. గాన నా ఒరిజినల్ పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది చిరునా మాకు అందించగలరని కోరుతున్నాను.

GODI PEDDA RAJU
S/o.Godi Bheema Raju, D.No.2-117,
Yerramsetti Vari Palem, Lakshmaneswaram Post
Narasapur Mandal, W.G.Dt., A.P

పాస్‌పోర్టు పోయినది

వల్లూరి దివ్య, భర్త: వినోద్ కుమార్ వల్లూరి డోర్ నెంబర్ 9-137, ధవళేశ్వరం, రాజమండ్రి రూరల్ మండలం, తూ.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా
నేను ది 12-10-2017లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి నెంబర్ R5897556, పాస్ పోర్ట్ పొందియున్నాను. ది 14-11-2025 న మా ఇంటి నుంచి పోడూరు మండలం లోని జిన్నూరు జెరాక్స్ సెంటర్‌కు నా పాస్ పోర్ట్ జెరాక్స్ తీయించుటకు, పాస్ పోర్ట్ రెన్యువల్ గురించి మాట్లాడటానికి బైక్ పై వెళుతుండగా దారిలో నా ఒరిజినల్ పాస్ పోర్ట్ పడి పోయినది. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్ కు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 9866003631